రహదారులు ఛిద్రం.. ప్రయాణం నరకం



పాత పోస్టాఫీస్ ఎదురుగా తవ్వి వదిలేసిన రోడ్డు

- అడుగడుగునా తవ్వి వదిలేసిన రోడ్లు
- పలుచోట్ల నిలిచిన రోడ్ల పనులు
- తంటాలు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- త్వరితగతిన బాగుచేయాలని అధికారులకు విజ్ఞప్తి



ఇనార్బిట్ మాల్ పరిసరాల్లో అధ్వానంగా రహదారులు



కైలాసపురం జంక్షన్ వద్ద రోడ్డు పక్కన దుస్థితి





తాటిచెట్లపాలెం హైవే నుంచి కైలాసపురంలో ఛిద్రమైన రోడ్డు

తాటిచెట్లపాలెం: కూటమి పాలనలో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతోపాటు పలు ప్రధాన రహదారులు కూడా ఛిద్రమయ్యాయి. అక్కడ, ఇక్కడ అని తేడా లేదు. ఏ చోట చూసినా ఛిద్రమైన, తవ్వి వదిలేసిన రోడ్లే దర్శనమిస్తున్నాయి. రోడ్లు బాగు చేస్తామని నాయకులు గొప్పగా చెప్పినప్పటికీ అదేం జరగలేదు. నేడు ఏ రహదారిని చూసినా గుంతలు, శిథిలాలు తప్ప మరేం కనిపించడం లేదు. ఎక్కడ ఎందుకు తవ్వుతున్నారో కూడా తెలియడం లేదు. ఒక పక్క యూజీడీ పనులు,, మరో పక్క 24 గంటల తాగునీటి సరఫరా, ఇంకో పక్క అభివృద్ధి పనుల కోసమంటూ ఎక్కడ చూసినా తవ్వి వదిలేసిన ఛిద్రమైన రహదారులే దర్శనమిస్తున్నాయి. వాటిపై ప్రయాణాలు నరకప్రాయంగా మారాయని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు.

ప్రమాదకరంగా కైలాసపురం రోడ్డు

జాతీయ రహదారి తాటిచెట్లపాలెం నుంచి కైలాసపురానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా సుమారు ఏడాదిగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇవి ఇంకా నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. ఈ మధ్య ఏమైందో తెలియదు కానీ.. ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రెండు వైపులా రోడ్డు తవ్వేయడంతో ఈ రోడ్డు కాస్తా ఇరుగ్గా మారింది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది.

కైలాసపురం – పోర్టు ఆస్పత్రి రోడ్డు

కైలాసపురం జంక్షన్ నుంచి ఇనార్బిట్ మాల్, పోర్ట్ హాస్పిటల్ వరకు రెండు మూడు చోట్ల రోడ్లు తవ్వి వదిలేశారు. ఇక్కడ ఎందుకు రోడ్డు తవ్వారో తెలియదు. మరో చోట పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్వి న రోడ్డును అరకొరగా పూర్తి చేయడంతో ఇక్కడ గోతులమయమై, వర్షపు నీరు నిలిచిపోయి ప్రమాదకరంగా మారింది.

తాటిచెట్లపాలెం హైవే పక్కన..

తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్క నుంచి తవ్వి వదిలేశారు. ఇక్కడ పనులు చాలా కాలంగా సాగడం లేదు. దీంతో రోడ్డు దాటాలన్నా కూడా పాదచారులకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పనులు పూర్తి కాక ఇబ్బందులు

ఏడాదిగా కైలాసపురం రోడ్డులో విస్తరణ పనులు చేస్తున్నారు. నేటికీ అవి పూర్తవలేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. విద్యార్థులు సమయానికి స్కూళ్లకు వెళ్లలేకపోతున్నారు. కేవలం 5 నిమిషాల్లో హైవేకు చేరుకునే వాళ్లం. ప్రస్తుతం 15 నిమిషాలు పడుతోంది. అధికారులు త్వరగా ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

– పి.రమణారావు, కైలాసపురం

ప్రమాదాలకు గురవుతున్నాం

తాటిచెట్లపాలెం హైవేలో చాలా కాలం నుంచి ఏవో పనుల నిమిత్తం రోడ్డు తవ్వుతున్నారు. గోతులు పూడ్చే పనులు పూర్తవ లేదు. గోతుల దారులను సరిచేయడం లేదు. స్థానికులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలి.

– కె.సతీష్, తాటిచెట్లపాలెం

రోడ్డు తవ్వి.. డెబ్రిస్ వదిలేశారు

కైలాసపురం ఇనార్బిట్ మాల్ పక్కన, పాత పోస్టాఫీసు ఎదురుగా మెయిన్ రోడ్డుకు ఇరువైపులా తవ్వి వదిలేశారు. ఇక్కడ రోడ్డు ఎందుకు తవ్వారో తెలియడం లేదు. రోడ్డు తవ్విన డెబ్రిస్ కూడా ఇక్కడే ఫుట్‌పాత్‌ల పైనే వదిలేశారు. దీంతో ఫుట్‌పాత్‌లను వదిలి రోడ్డు మీద ప్రజలు నడవాల్సి వస్తోంది. వాహనాలు పాడవుతున్నాయి.

– పి.రాము, సింహగిరి కాలనీ

క్లుప్తంగా

పైడిమాంబ జాతరకు ఏర్పాట్లు



కంచరపాలెం: జీవీఎంసీ 54,57వ వార్డుల పరిధిలోని ఐటీఐ జంక్షన్ దరి సంకురపేట గ్రామ ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి వార్షిక జాతరను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం గ్రామ పెద్దలు పిల్లి మురళీరమణ, జుత్తుక రాము తదితరులు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 16న పైడిమాంబ తొలేళ్ల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం వద్ద పూజలు చేయనున్నారు. 17న అమ్మవారి ప్రధాన జాతర, 24న అమ్మవారి మారువారం జాతర, భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ పరిసరాలు, గాలి గోపురం సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక, నృత్య కార్యక్రమాల నిర్వహణకు వేదికలు సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు శంకర్, సూరిబాబు, అప్పలరాజు, రామకృష్ణ, కుమార్, పూజారులు పిల్లి వెంకటరెడ్డి పిల్లి నాగమణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా సాధన



యోగా సాధనలో వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ఈ నెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వాకర్స్ క్లబ్ సభ్యులు సాధన చేస్తున్నారు. దీనిలో భాగంగా యోగా మాస్టర్ సునీల్ పర్యవేక్షణలో వాకర్స్ పార్కు ప్రాంగణంలో శుక్రవారం యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సహ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, ఇతర సభ్యులు పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు సాధన చేశారు.

మధురానగర్ పాఠశాల హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ



నాగజ్యోతికుమారి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా సింగంపల్లి నాగజ్యోతి కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన బి.దేముడుబాబు టౌన్ కొత్తరోడ్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. రైల్వే న్యూకాలనీ ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న నాగజ్యోతి మధురానగర్ పాఠశాలకు బదిలీపై వచ్చారు.

సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు రేపు

సీతంపేట: ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యం గల వారికి ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విద్యార్థులకు ఉన్న సందేహాలను ఆయా సబ్జెక్టుల నిపుణులు నివృత్తి చేయనున్నారు.

కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ లైట్ల ఏర్పాటు



బాపూజీనగర్‌లో విద్యుత్ స్తంభానికి లైటు అమర్చుతున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి ఇందిరానగర్, జవహర్‌లాల్ నగర్, బాపూజీనగర్, నెహ్రూనగర్, శివలింగపురం, పల్నాటి కాలనీ తదితర కొండవాలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ స్తంభాలకు కొత్త లైట్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో కొంత కాలంగా విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగక పోవడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై కార్పొరేటర్ గంకల కవితకు స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఆమె అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. జీవీఎంసీ జోన్–5 విద్యుత్ లైట్ల విభాగం ఏఈ అర్చన పర్యవేక్షణలో సిబ్బంది కొత్త విద్యుత్ లైట్లు అమర్చారు. కార్యక్రమంలో గంకల అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది' కరపత్రాల పంపిణీ



కరపత్రాలు అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం పరిధిలోని నివాసులకు అంగన్‌వాడీ కేంద్రం సేవలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను అందజేశారు. 'మన ఊరు – మన అంగన్‌వాడీ' గాంధీనగర్ కేంద్రంలో అడ్మిషన్లు జరుగుతున్నాయని స్థానికులకు వివరించారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు చక్కని ఆటపాటలతోపాటు కథలు, తెలుగు, ఇంగ్లిష్ బోధన, కిడ్స్ కేర్, ప్రతి రోజూ ఉచిత భోజనం, స్నాక్స్ అందిస్తామని, నర్సరీ నుంచి ఎల్‌కేజీ వరకు శిక్షణ ఉంటుందని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో టీచర్ మాలా బీబీ, ఎంఎస్‌కె వరలక్ష్మి, ఏఎస్ఎం స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు హెచ్‌ఎం లక్ష్మీ నరస ఆధ్వర్యంలో ఎస్ఆర్‌కే కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారం క్లాత్ అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగ జ్యోతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'అంబేడ్కర్ ఐడియాలజీ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ తదితరులు

విశాఖ సిటీ: మోడ్రనైజింగ్ డాక్టర్ అంబేడ్కర్ ఐడియాలజీ పుస్తకాన్ని డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మెంబర్ సెక్రటరీ ప్రభాత్ కుమార్ సింగ్ సమక్షంలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ ఆవిష్కరించారు. నేటితరం యువతను అంబేడ్కర్ ఆలోచనలతో అనుసంధానం చేసే విధానాన్ని పుస్తకంలో వివరించినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్‌ల ప్రగతిని సమీక్షించడానికి శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ 2024–25లో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధితోపాటు 2025– 26 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ సభ్యులకు వివరించారు. ఏయూలో ఏర్పాటైన అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైవిధ్యమైన కార్యక్రమాలు, ప్రజలకు, యువతకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైవిధ్యమైన పరిశోధనలతోపాటు విభిన్న వర్గాలకు చేరువయ్యేలా అంబేడ్కర్ చైర్ నిర్వహించిన కార్యక్రమాలను అమిత్ యాదవ్ ప్రశంసించారు. యువతలో అంబేడ్కర్ ఆలోచనలను తీసుకెళ్లి వారిని ప్రభావితం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏయూ అంబేడ్కర్ చైర్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్షకు ఏయూ తరఫున ఆర్–డీ విభాగం డీన్ ఆచార్య వి.వల్లి కుమారి ప్రాతినిధ్యం వహించారు.

టెన్త్ టాపర్లకు సత్కారం



విద్యార్థులు, ఎన్‌సీసీ ఆఫీసర్ విశ్వనాథంను సత్కరిస్తున్న ఎంఈవో బాలామణి

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఇటీవల టెన్త్ పరీక్షల్లో 500 మార్కులు దాటిన విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ టాపర్లతోపాటు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను మండల విద్యా శాఖాధికారి బాలామణి చేతుల మీదుగా సత్కరించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం గ్రేడ్ 2 తెలుగు పండిట్ నుంచి తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా వారిని సన్మానించారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు రిజర్వేషన్ కారణంగా పలువురు విద్యార్థులు ఐఐటీ, పాలిటెక్నిక్‌లో సీట్లు లభించడంతో విశ్వనాథంను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, నిర్మల, టి.కిషోర్, వై.రామలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గంధభరితం..!



అశోక్‌నగర్ గెడ్డలో తొలగించిన పూడికను జనావాసాల మధ్య వదిలేసిన దృశ్యం



గెడ్డలో తొలగించని సిల్ట్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి అశోక్‌నగర్, జాషువానగర్, వాడ వీధి, జోగారావునగర్, యల్లబిల్లివారి వీధి, రెడ్డికంచరపాలెం తదితర ప్రాంతాల్లోని గెడ్డలు, కాలువల్లోని చెత్త, వ్యర్థాలను తొలగించి పక్కన వదిలేస్తున్నారు. జోన్–5 ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారుల పర్యవేక్షణలో గత వారంలో సిల్ట్‌లు, పూడికలు, చెత్తా చెదారం తొలగించారు. గెడ్డలకు ఆనుకుని పూడికలు, డెబ్రిస్‌లు ఉన్న వీధుల్లో రోడ్లకు ఇరువైపులా వేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ఆయా ప్రాంతాలకు వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలు, కాలువల్లో తీసిన పూడికలను తరలించాలని ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిపై చెత్తను తొలగించక పోవడంతో తాజాగా కురుస్తున్న వర్షాలకు సగం మేర పూడికలు మళ్లీ కాలువలు, గెడ్డలోకి చేరుతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో పూర్తిస్థాయిలో పూడికలు తొలగించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాటిని పశువులు చిందరవందర చేస్తున్నాయని అంటున్నారు. వర్షాలు కురుస్తుండటంతో రోగాల బారిన పడే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జోనల్ కమిషనర్ వార్డులో పర్యటించి, పారిశుధ్య సమస్యను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో 18 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. విరుధునగర్ జిల్లా తమిళనాడుకు చెందిన సెల్వన్ విశాఖ రైల్వేస్టేషన్‌కు గంజాయిని అక్రమంగా తీసుకురావడాన్ని గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. రూ.90 వేల విలువైన 18 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

'ఆహార తనిఖీ నకిలీ అధికారులతో జాగ్రత్త'

బీచ్‌రోడ్డు: కొందరు అపరిచితులు ఆహార తనిఖీ అధికారులమంటూ హోటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి బెదిరిస్తూ డబ్బు దోచుకోడానికి పాల్పడుతున్నారని ప్రాంతీయ ఆహార కల్తీ సహాయ నియంత్రణ అధికారి జి.ఎ.పి.నందాజీ అన్నారు. పెదవాల్తేరు జిల్లా సహాయ కల్తీ నియంత్రణ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పలు హోటళ్ల నిర్వాహకులకు అపరిచితులు ఫోన్ కాల్స్ ద్వారా తాము ఆహార కల్తీ నియంత్రణ అధికారులమని చెప్పి.. లైసెన్స్ కాలపరిమితి దాటిందని, హోటళ్ల జరిమానాలు పెండింగ్‌లో ఉన్నాయని బెదిరించి, ఫోన్‌పే చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయాలని చెప్పడంతో అనుమానం వచ్చి పలువురు హోటళ్ల నిర్వాహకులు ఆహార కల్తీ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 89189 73750 నంబర్ ద్వారా కాల్స్ వస్తున్నాయని చెప్పారు. ఈ నంబర్ గల వ్యక్తికి తమ విభాగానికి ఎటువంటి సంబంధం లేదని నందాజీ స్పష్టం చేశారు. హోటళ్ల యజమానులు ఆహార తనిఖీ నకిలీ అధికారులపై జాగ్రత్త వహించాలని కోరారు.

కిరండూల్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన



రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం రాయగడ డివిజన్ రైల్వే మేనేజర్ అబితాబ్ సింఘాల్‌తో కలసి కిరండూల్ సెక్షన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా దమన్‌జోడి–కిరండూల్ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సమీక్షించారు. ట్రాఫిక్, ప్రయాణికుల సదుపాయాలను జీఎం పరిశీలించారు. దమన్‌జోడి, జగదల్‌పూర్, కిరండూల్ స్టేషన్లు, రైల్వే కాలనీల్లో పర్యటించారు. అక్కడ ఆధునికీకరించిన ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికుల సలహాలు, అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం విండో ట్రయలింగ్ తనిఖీల ద్వారా డబ్లింగ్ పనులు, మలుపులు, వంతెనలు, టన్నెల్స్, వివిధ భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పర్యటనలో వాల్తేర్ డివిజన్ ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ బి.ఎస్.రాజకుమార్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో కూలిన ప్రహరీ



మురళీనగర్ వాకర్స్ పార్కులో కూలిన గోడ

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ప్రహరీ గోడ కూలిపోయింది. పార్కు నిర్మాణంలో భాగంగా దీని స్థలం చుట్టూ 1989లో ఈ ప్రహరీ నిర్మించారు. ఇప్పటి వరకు ఇదే కొనసాగింది. కొత్తగా గోడ నిర్మించలేదు. ఇది శిథిలమవడంతో కూలిపోతుందని భయపడేవారు. దీన్ని పునర్నిర్మించాలని గతంలో వాకర్స్ క్లబ్ సభ్యులు జీవీఎంసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. పార్కు వెలుపలి వైపు ప్రహరీ, రహదారి మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలను పొక్లెయిన్‌తో తొలగిస్తుండగా.. కొమ్మ తగలగానే ప్రహరీ కూలిపోయింది. పార్కులో ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ పనుల కారణంగా ట్రాక్ మూసివేయడం వల్ల ప్రమాదం తప్పింది. బేస్‌మెంట్‌పై ఉన్న సుమారు 200 మీటర్ల గోడ కూలిపోయింది. మిగతా ప్రాంతం కూడా కూలిపోయే పరిస్థితి ఉంది. అధికారులు తక్షణం స్పందించి శిథిలమైన ప్రాంతంలో గోడను పునర్నిర్మించాలని వాకర్స్ కోరుతున్నారు.

బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఎల్ అనుసంధానం తప్పనిసరి

ఎంవీపీకాలనీ: తల్లికి వందనం పథకంలో భాగంగా 9, 10 తరగతులతోపాటు ఇంటర్ చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఎల్ అనుసంధానం తప్పనిసరిగా చేయించాలని సాంఘిక సంక్షేమ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆ శాఖ డీడీ కె.రామారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను కానీ, పోస్టల్ కార్యాలయంలో గాని, ఆయా బ్యాంకులను గాని సంప్రదించి ఈ సేవలు పొందవచ్చన్నారు. శనివారం అన్ని సచివాలయాలు, పోస్టల్ కార్యాలయాల్లో ఎన్‌పీసీఎల్ అనుసంధానం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత

బీచ్‌రోడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి కె.నీలిమ సూచించారు. గర్భిణులు, బాలింతలు సమీప అంగన్‌వాడీ సెంటర్లలో తమ పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలన్నారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం సెక్టార్‌లోని 28వ వార్డు పందిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ముఖ్య అతిథి సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత చిన్నారులతో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. పల్లెంలో బియ్యం వేసి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లల్లో చేర్పించి, అక్కడ అందిస్తున్న ఆటపాటలతో కూడిన విద్యను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.